# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి నుంచి పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తెలంగాణా రాష్ట్రం 2047 సంవత్సరం నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆకాంక్షించారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని తెల్ల రేషన్ కార్డుదారులకు జనవరి 1 నుంచి రాగులు, గోధుమ పిండి అందజేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

4. **యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉద్యోగ మేళాలు ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు.**

5. **ఉత్తరాది నుంచి వచ్చే చలిగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి నుంచి పౌరులకు అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్ - ఆర్టీజీఎస్ పై సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో ప్రజలకు సేవలు పారదర్శకంగా అందడం వల్ల వారిలో ప్రభుత్వ పని తీరు పట్ల సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. ఇప్పటికీ కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయని అలాంటి శాఖలు ఆన్‌లైన్ సేవలు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ, ప్రభుత్వ కార్యాలయాలకు తిరగనవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికానికి నమోదైన స్థూల రాష్ట్ర ఉత్పత్తి –జీఎస్డీపీ వృద్ధిరేటు, రంగాల వారీగా గణాంకాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 11.89 శాతం మేర తలసరి ఆదాయంలో పెరుగుదల నమోదైందని చెప్పారు.

వాయిస్ 32 సెకన్లు

-----------------------------

తెలంగాణా రాష్ట్రం 2047 సంవత్సరం నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆకాంక్షించారు.రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న "తెలంగాణా రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ , వికసిత భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణా రాష్ట్రం ముందుకు వెళ్తోందని అన్నారు. ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే తెలంగాణా రాష్ట్రాన్ని ఉత్తమ రాష్ట్రంగా నిలపాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా 44 దేశాల నుండి దాదాపు 154 మంది ప్రతినిధులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, దేశ, విదేశీ పారిశ్రామిక ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఈ రోజు ముగియనున్న ఈ సదస్సులో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకోనుంది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తెల్ల రేషన్ కార్డుదారులకు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రాగులు, గోధుమ పిండి అందజేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీతో మంత్రి మనోహర్ నిన్న ఢిల్లీలో సమావేశమయ్యారు. అనంతరం ఏపీభవన్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. ఈ రెండు సరుకులను జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర మంత్రి అంగీకరించారని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యం సరఫరాలో క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు పూర్తి అనుకూలమని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్ ఫ్రాన్సిస్కోలోని అంతర్జాతీయస్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా విసి మేనేజింగ్ పార్టనర్ అరుణ్ కుమార్ తో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, విశాఖనగరం ఐటి, డేటా హబ్ గా అభివృద్ధి చెందుతోందని, ఆంధ్రప్రదేశ్ లో డీప్ టెక్ ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటుచేయాలని కోరారు. సెమీ కండక్టర్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని, పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర ప్రోత్సాహకాలను అందిస్తోందని మంత్రి వివరించారు.

-----------------------------

ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

పరిస్థితులను సాధారణ స్థితికి తేవడంతోపాటు, ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రాధాన్యం ఇచ్చారని తెలుగు దేశం పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రిఫండ్, రీబుకింగ్, సామానుల అప్పగింత, టికెట్ల ధరలపై పరిమితి విధించడం వంటి చర్యలు చేపట్టారని తెలిపారు. ఇప్పటివరకు 99 శాతం రిఫండ్, 90 శాతం బ్యాగ్‌ల అప్పగింత పూర్తయ్యాయని శ్రీకృష్ణ దేవరాయలు తెలియజేస్తూ,

వాయిస్ 22 సెకన్లు

---

కాశీ తమిళ సంగమం 4.0 కార్యక్రమంలో భాగంగా తమిళనాడు నుండి రచయితలు, మీడియా నిపుణులతో కూడిన 4వ బృందం వారణాసి చేరుకుంది. ఈ బృందం బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోని సాంస్కృతిక అధ్యయన కేంద్రాన్ని సందర్శించింది. అలాగే శంకరాచార్య మఠాన్ని కూడా సందర్శించింది. అనంతరం నమో ఘాట్‌లో కాశీ తమిళనాడు సంగమం ఉమ్మడి వారసత్వాన్ని తెలిపేలా నిర్వహించిన సంగీతం ప్రదర్శనలో పాల్గొన్నారు.

---

యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉద్యోగ మేళాలు ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కర్నూలులోని స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఓర్వకల్ పారిశ్రామిక వాడలో పదివేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. త్వరలో నైపుణ్య శిక్షణ కు సంబంధించిన సంస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువత ఉద్యోగాలకు తగిన విద్యార్హతలు, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు.

---

ఉత్తరాది నుంచి వచ్చే చలిగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కనిష్ఠ ఉష్ణోగ్రతల – నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జి మాడుగులలో కనిష్ఠ ఉష్ణోగ్రత 5.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అలాగే పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విజయనగరం, శ్రీసత్యసాయి, శ్రీకాకుళం, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, కాకినాడ, ఎన్టీఆర్, నంద్యాల, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో 15 డిగ్రీల సెల్సియస్‌లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక తెలంగాణలోని సంగారెడ్డిలో 6.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

---

కాలుష్య రహిత రవాణా, సురక్షిత రహదారులే తెలంగాణ ప్రభుత్వ భవిష్యత్ లక్ష్యాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 'గ్లోబల్ సమిట్'లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన 'గ్రీన్ మొబిలిటీ 2047–జీరో ఎమిషన్ వాహనాలు' అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, శూన్య ఉద్గారాల రవాణా –జీరో ఎమిషన్ మొబిలిటీలో దేశంలో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా మారుస్తామని స్పష్టం చేశారు. 2047 నాటికి రాష్ట్రంలో విద్యుత్ వాహనాలే

తిరుగుతాయని తెలిపారు .'తెలంగాణ రైజింగ్ విజన్-2047కి అనుగుణంగా స్మార్ట్ టెక్నాలజీ, డిజిటలైజేషన్, పారదర్శకతతో కూడిన రవాణాపర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా మంగళగిరిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం సాంకేతికత, వినూత్న ఆవిష్కరణలు, మేధోసంపత్తి హక్కులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యశాలను నిర్వహించనుంది. జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ -ఎస్ఆర్డీసీ, ఏపీఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్లు సంయుక్తగా నిర్వహించే ఈ కార్యశాలలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొననున్నారు.

=====================